క్లుప్తంగా

26 నుంచి ఫ్లెక్సీలు నిషేధం

గురజాల : జనవరి 26వ తేదీ నుంచి విధిగా ఫ్లెక్సీలు నిషేధం చేయనున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ అన్నదాత మోహన్ శ్రీనివాస్ తెలిపారు. నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 26 నుంచి ఫ్లెక్సీలు నిషేధించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్క రాజకీయ నాయకులు, వ్యాపారస్తులు సహకరించాలన్నారు. ఎవరైనా ఉన్నతాధికారుల ఆదేశాలు దిక్కరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

గురజాల : ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఫణికుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ గురువారం చర్లగుడిపాడు గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి ఆధార్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఆధార్ కేంద్రంలో ఆధార్ తప్పు ఒప్పు లను సరిచేసుకోవడం వంటివి చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పథకాలను సద్విని యోగం చేసుకోవాలి

మాచర్ల : కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం గొప్ప అవకాశాన్ని కల్పించిందని, పోస్టాఫీసు ద్వారా రూ. 399/-లు చెల్లించి రూ. 10 లక్షల వరకు ప్రమాద బీమాను పొందవచ్చని పట్టణ పోస్ట్‌మాస్టర్ జి.వీరాంజనేయులు తెలిపారు. బుధవారం స్థానిక పోస్టాఫీస్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రమాదభరిత జీవిత బీమా గురించి తెలియపరిచారు. ప్రతి వ్యక్తి రూ. 399/-లు ఏడాదికి పోస్టాఫీసులో చెల్లిస్తే ప్రమాద బీమా కింద రూ. 10 లక్షల వరకు వస్తుందన్నారు. ప్రమాదంలో శాశ్వతంగా అంగవైకల్యం కలిగితే రూ. 10 లక్షల బీమా అందజేయడం జరుగుతుందన్నారు. మొత్తం 9 సౌకర్యాలున్నాయని ఆయన చెప్పారు. మాచర్ల పోస్టాఫీస్‌లో ఈనెల 19వ తేదీన జరిగే ప్రమాద బీమా మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కిడ్నీ బాధితురాలికి ఆర్థిక సాయం



పిడుగురాళ్ల: పట్టణంలోని రసూల్ పేటలోని కిడ్నీ వ్యాధితో బాధపడుతు ఆపరేషన్‌కు, మందులు కొనడానికి డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న నూతలపాటి తయారు లక్ష్మీ ఆపరేషను కోసం ఆర్థిక సహాయం నిమిత్తం లయన్స్ క్లబ్ సభ్యులను సంప్రదించగా క్లబ్ సభ్యులు వెంటనే స్పందించి ఆమె ఆపరేషన్ నిమిత్తం రూ. 10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో టంగుటూరి సతీష్, గుండా నారాయణరావు, ఆముదాల చిన గంగాధర్, కోడూరు శంకర్, కొనకండ్ల శ్రీను, కాశీ విశ్వనాధం, అవుల జనార్ధన్, అత్మకురి రామకృ, ఏటూరి నరసింహారావు, గుండా రమేష్, మధుసూదనాచారి, దీకొండ వెంకట స్వామి, యడవల్లి ఏడుకొండలు తదితరులు ఉన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



పిడుగురాళ్ల: పట్టణంలోని స్కాలర్స్ విద్యా సంస్థల అధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలు బుధవారంతో ముగిశాయి. మొదటి బహుమతి వబ్బతి డిటల్స్ సీసీ, త్రిలోక్ సీసీ జట్లు తలపడగా త్రిలోక్ సీసీ విజయం సాధించింది. విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొమ్మా మహేష్, స్కాలర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అవుల జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో బాలుడికి తీవ్రగాయాలు

నకరికల్లు: విద్యుత్‌షాక్ గురై ఎనిమిదేళ్ల బాలుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన స్థానిక ఎస్సీకాలనీలో బుధవారం జరిగింది. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల మేరకు కాలనీకి చెందిన సీహెచ్.గౌతం 3వతరగతి చదువుతున్నాడు. పాఠశాల సమీపంలో గాలిపటంతో ఆడుకుంటుండగా ఎగిరి సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌పై పడింది. దాన్ని తీసేందుకు వెళ్లడంతో బాలుడు తీవ్ర విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. రెండుచేతులు మోచేతుల వరకు కాలి తీవ్రగాయాలయ్యాయి. స్పందించిన స్థానికులు, కుటుంబ సభ్యులు క్షతగాత్రుడిని హుటాహుటీన నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. కాగా పాఠశాల సమీపంలో గల ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండడంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు మండిపడుతున్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి టీడీపీ నేతల చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల : రాష్ట్రంలో బీసీలతోపాటు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50 శాతం అవకాశం కల్పిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు జేజేలు పలుకుతున్నారని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో వెల్దుర్తి మండలానికి చెందిన గుండ్లపాడు గ్రామ టీడీపీ నాయకులు సాని బ్రహ్మయ్య, సాంబశివరావులు ఎంపీపీ చింతా శివరామయ్య, పార్టీ మండల నాయకులు ఆదినారాయణ, సర్పంచ్ తోట శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ తోట అంజనేయులు, మండల పార్టీ నాయకులు పార్లవల్లి పెద గాలెయ్య ఆధ్వర్యంలో వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన ఐదు కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పీఆర్కే వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సాని కోటేశ్వరరావు, జవిశెట్టి శ్రీనివాసరావు, గోపతి రాంబాబు, పి.చిన్నగాలెయ్య, జవిశెట్టి వెంకయ్య, చింతా బాదరయ్యలతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఖాతాదారుల అకౌంట్‌ల నుంచి నగదు మాయం

దాచేపల్లి : ఖాతాదారుల బ్యాంక్ అకౌంట్‌ల నుంచి నగదు మాయం అయ్యాయి. ఈ మేరకు బాధిత ఖాతదారులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో, బ్యాంక్ మేనేజర్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. స్థానిక ఎస్‌బీఐ బ్యాంక్ ఖాతాదారులైన ఎస్. వెంకటేశ్వర్లు, జి. ప్రసాదరావు, ఎస్. నాగేశ్వరరావుతో పాటుగా మరి కొంతమంది బ్యాంక్ అకౌంట్‌ల నుంచి నగదు డ్రా అయినట్లుగా ఈ నెల 14వ తేదీన సెల్‌ఫోన్స్‌కు మెస్సెజి వచ్చింది. ఖాతదారులు ఎటువంటి లావాదేవీలు జరపకుండా అకౌంట్ నుంచి నగదు మాయం కావడంపై ఆందోళన చెందారు. బుధవారం బ్యాంక్‌కు పలువురు ఖాతదారులు వెళ్లి తమ ఖాతాల నుంచి నగదు డ్రా అయినట్లుగా ఫిర్యాదు చేశారు. వేలిముద్రల ద్వారా నగదు డ్రా అయినట్లుగా ఎస్‌బీఐ బ్యాంక్ అధికారులు గుర్తించారు. దీంతో పోలీసులకు, బ్యాంక్ అధికారులకు ఖాతదారులు ఫిర్యాదు చేశారు. మండల వ్యాప్తంగా సుమారుగా 70 మంది ఖాతదారుల నుంచి రూ. 3లక్షల వరకు మాయం అయినట్లుగా ప్రచారం జరుగుతోంది. ముగ్గురు ఖాతదారుల అకౌంట్‌ల నుంచి రూ.5,400 డ్రా అయినట్లుగా తమకు ఫిర్యాదు చేశారని, దీనిపై శాఖపరమైన విచారణతో పాటు పోలీసులకు కూడా సమాచారం ఇచ్చామని మేనేజర్ రామాంజనేయులు చెప్పారు. బ్యాంక్ అకౌంట్‌లలో ఉన్న నగదుపై ఖాతదారులు ఆందోళన చెందవద్దని, ఇటువంటి ఘటనలకు జరగకుండా చర్యలు తీసుకుంటామని మేనేజర్ చెప్పారు.

సురక్ష మిత్ర పథకం సంక్రాంతి లక్కీ డ్రా



విజేతలకు బహుమతులను అందజేస్తున్న, గురజాల డీటీ శ్రీనివాస శర్మ

పిడుగురాళ్ల: పట్టణంలోని శ్రీనివాస గ్యాస్ ఏజెన్సీ ఆధ్వరంలో సురక్ష మిత్ర లక్కీ డ్రాను గురజాల సివిల్ సప్లై డీటీ కె. శ్రీనివాస శర్మ విడుదల చేశారు. మొదటి బహుమతి రైస్ కుక్కర్‌ను దాచేపల్లి మండలం తంగెడ గ్రామానికి చెందిన వెంకటేశ్వరరెడ్డి, రెండవ బహుమతి సురక్ష యాప్రాన్‌ను పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన టి. ధనమ్మ, మూడవ బహుమతి సిలిండర్ ట్రాలీని పిడుగురాళ్ల మండలం కామేపల్లి గ్రామానికి చెందిన సామ్రాజ్యం గెలుచుకున్నారు. విజేతలకు గురజాల సివిల్ సప్లై డీటీ కె. శ్రీనివాసశర్మ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా శ్రీనివాసశర్మ మాట్లాడుతూ గ్యాస్ ఏజెన్సీలు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం చాలా ఆనందించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు గుంటుపల్లి వీర భుజంగ రాయలు, సిబ్బంది ఉన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్‌టీఓ సీహెచ్ రాంబాబు

ఆర్‌టీఓ సీహెచ్ రాంబాబు

పిడుగురాళ్ల: రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని పిడుగురాళ్ల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రాంబాబు అన్నారు. పట్టణంలోని ఆర్‌టీఓ కార్యాలయంలో 34వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 18 నుంచి 24వ తేదీ వరకు ఈ వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రోడ్డు ప్రమాదాలు సంభవిస్తే ఒక వ్యక్తి మాత్రమే మరణిస్తున్నాడని అనుకోకూడదని, ఆ వ్యక్తి వెనుక ఒక కుటుంబం, అతని మీద ఆధారపడిన కుటుంబం కూడా ఉంటుందని తెలియజేశారు. కావున హెల్మెట్ లేకుండా ప్రయాణించ కూడదని, అతివేగంగా ద్విచక్ర వాహనాలు నడపరాదని తెలియజేశారు. కారులో సీట్ బెల్ట్ తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. అంతేకాకుండా డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన పత్రాలు కూడా వెంట తీసుకుని రావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ కార్యాలయం సిబ్బంది, వాహన దారులు ఉన్నారు.

ప్రమాదవశాత్తు ప్రయాణికుడికి గాయాలు



దాచేపల్లి : రైలు ఎక్కే క్రమంలో ప్రయాణికుడు ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడిన ఘటన నడికుడి రైల్వేస్టేషన్‌లో బుధవారం జరిగింది. మండలంలోని మాదినపాడుకు చెందిన ఎస్. ఫణీంద్ర ఈ ఘటనలో తీవ్రంగా గాయపడడంతో 108 వాహనంలో గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నడికుడి నుంచి గుంటూరు వెళ్లేందుకు శివమాలధరించిన ఫణీంద్ర మాచర్ల ప్యాసింజర్ రైలు ఎక్కేందుకు స్టేషన్‌కు చేరుకున్నాడు. రైలు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. ఘటనలో కాళ్లు, తలకు తీవ్రంగా గాయాలైయ్యాయి. క్షతగాత్రుని 108 వాహనంలో హుటాహుటిన చికిత్స కోసం గురజాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. సంఘటనా స్థలాన్ని రైల్వే పోలీసులు పరిశీలించారు.

ఇల్లు దగ్ధం

గురజాల : పూరిగుడిసె దగ్ధమైన ఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. మండల పరిధిలోని దైద గ్రామంలో రాముల కనకయ్య కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం సాయంత్రం ఇంట్లో పొయ్యి వెలిగించడంతో పొయ్యికి సమీపంలో టైర్లు ఉండడంతో గుడిసెకు నిప్పు అంటుకుంది. వెంటనే చుట్టుపక్కల వారిని పిలిచి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. పూరిగుడిసె కావడంతో మంటలు ఒక్కసారిగా అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న పత్తి సైతం మంటల్లో ఆహుతైంది. ఇంట్లోలోని వస్తువులు, పత్తి మొత్తం బుడిదపాలైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ. 60 వేలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లిందని కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తు తమను ప్రభుత్వం ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ రెవెన్యూ అధికారి సర్వేశ్వరరావుకు సమాచారం ఇవ్వడంతో ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.

మైనర్ బాలికపై అత్యాచారయత్నం

రాజుపాలెం: మండలంలోని కొండమోడు ఎస్టీ కాలనీ సమీపంలో ఓ మైనర్ బాలికపై యువకుడు అత్యాచార యత్నానికి ప్రయత్నించాడు. మంగళవారం సాయంత్రం మైనర్ బాలిక ,తల్లి ఇరువురు కలిసి ఇంటి వద్ద నుంచి కొండమోడు జంక్షన్‌కు బయలుదేరారు. తల్లి చకచక నడుచుకుంటూ వెళ్తుండా మైనర్ బాలిక సెల్‌ఫోన్ చూస్తూ వెనుకజలో ఉంది. ఇదే క్రమంలో అదే గ్రామానికి చెందిన యువకుడు బాలికను వెంటపడి చెయ్యి పట్టుకుని పక్కకు లాగి చీకటి రోడ్డులోకి తీసుకెళ్లి అత్యాచార యత్నానికి ప్రయత్నించగా తల్లి చూసి కేకలు వేయడంతో యువకుడు పరారయ్యాడు. తల్లి వెంటనే స్థానిక పోలీసు స్టేషన్‌కు వచ్చి యువకుడిపై ఫిర్యాదు చేసింది. బుధవారం ఉదయం స్థానిక ఎస్ఐ షఫీ, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని జరిగిన విషయాన్ని బాలిక ద్వారా తెలుసుకుని కేసు నమోదు చేశారు. యువకుడు పరారీలో ఉన్నాడు. పోలీసులు గాలిస్తున్నారు.

నియోజకవర్గంలో రెండు వర్గాలుగా ఎన్టీఆర్ వర్ధంతి

సత్తెనపల్లి: మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 27 వర్ధంతిని టీడీపీ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి బుధవారం నిర్వహించారు. మాజీ శాసన సభ్యుడు వైవీ ఆంజనేయులు, టీడీపీ నాయకుడు డాక్టర్ కోడెల శివరాం వేరువేరుగా పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో ఎన్టీఆర్ విగ్రహా ప్రతిమకు పూలమాలవేసి నివాళులర్పించారు. వేరు వేరుగా అన్న సంతర్పణలు నిర్వహించారు. అలాగే పట్టణంలోని వివిధ వార్డుల్లో, గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు వేరువేరుగా పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే సమన్యాయం

జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యుడు సభావత్ రవినాయక్



రవినాయక్‌ను సన్మానిస్తున్న పార్టీ నేతలు

విజయపురిసౌత్: వైఎస్సార్ సీపీతోనే సమన్యాయం జరుగుతుందని, పార్టీలో కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు వచ్చే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కృషి చేస్తున్నారని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యుడు సభావత్ రవినాయక్ అన్నారు. బుధవారం విజయపురిసౌత్ సమీపంలోని సేవాలాల్ భీమాలాల్ జంక్షన్ వద్ద శ్రీ సంత్‌సేవాలాల్ మహారాజ్ ఆలయ ప్రాంగణంలో పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యుడుగా నూతనంగా ఎన్నికైన సభావత్ రవినాయక్‌ను మాజీ సర్పంచ్ కరంటోత్ పాండు నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రవినాయక్ మాట్లాడుతూ తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన ప్రభుత్వ విప్ పీఆర్కేకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బడుగు, బలహీన వర్గాలకు పదవులు హర్షణీయమన్నారు. అనంతరం పాండునాయక్ మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు మహారాష్ట్రలోని జలగావ్ జిల్లా జాంనేర్ సమీపంలోని గోద్రిలో జరిగే అఖిల భారతీయ బంజారా కుంభమేళ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలంటూ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో పసువేముల సర్పంచ్ కర్రా చిన రంగయ్య, నీటి సంఘం ప్రెసిడెంట్ ముడావత్ బాలాజీనాయక్, రమావత్ హాతీరామ్ నాయక్, మూడావత్ మంగ్తానాయక్, మూన్సవత్ సక్రునాయక్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు నకరికల్లు క్రీడాకారులు



నకరికల్లు: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు పోటీలకు స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల క్రీడాకారులు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ చింతా పుల్లయ్య బుధవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11వతేదీన నంబూరులో నిర్వహించిన ఉమ్మడి గుంటూరు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థిని నెమలికంటి శ్రీజ 200మీటర్ల పరుగుపందెంలో మొదటిస్థానం, 400 మీటర్లు, 600 మీటర్ల పరుగుపందెంలో ద్వితీయస్థానాన్ని కైవసం చేసుకుందన్నారు. పానాది లేఖ్యసాయితులసి డిస్కస్‌త్రోలో ప్రథమస్థానం సాధించగా, రమావత్ రవితేజనాయక్ హైజంప్‌లో ప్రథమస్థానం కైవసం చేసుకున్నట్లు తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులు శ్రీకాకుళంలో ఈనెల 20,21,22 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో తలపడతారన్నారు. ఎంపికైన క్రీడాకారులకు, వారికి శిక్షణనిచ్చిన ఫిజికల్ డైరెక్టర్ చింతా పుల్లయ్య, క్రీడాఉపాధ్యాయులు షేక్.ఫాతిమా, కె.వెంకటేశ్వర్లులను విద్యాకమిటీ చైర్మన్ షేక్.ముష్తాక్ మస్తాన్‌వలి, ప్రధానోపాధ్యాయురాలు కె.రంగాదేవిలు అభినందించారు.

రిపబ్లిక్ డే వేడుకల్లో మన రాష్ట్రం నుంచి ఇంద్రసేనారెడ్డి



తోటి కళాకారులతో ఇంద్రసేనారెడ్డి

కారెంపూడి: దేశ రాజధాని ఢిల్లీలో జనవరి 26న జరగనున్న రిపబ్లిక్ డే వేడుకల్లో మన రాష్ట్రం నుంచి పాల్గొంటున్న కళాకారులకు కొరియోగ్రాఫర్‌గా పల్నాడు జిల్లా కారెంపూడికి చెందిన నాగిరెడ్డి ఇంద్రసేనారెడ్డి వ్యవహరిస్తున్నారు. రిపబ్లిక్ డే వేడుకల్లో లంబాడీ డాన్స్, గూసడి డాన్స్ ప్రదర్శనలిచ్చేందుకు మన రాష్ట్రం నుంచి ఎంపికైన 80 మంది కళాకారుల బృందాలకు ఇంద్రసేనారెడ్డి టీమ్ లీడర్‌గా కొరియోగ్రాఫర్‌గా ఎంపికై ప్రస్తుతం వారిని గైడ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగుతున్న ప్రీ రిపబ్లిక్ డే ఈవెంట్స్‌లో లంబాడి , గూసడి నృత్య ప్రదర్శనలకు ఇంద్రసేనారెడ్డి కొరియోగ్రాఫ్ చేస్తున్నారు. ఇంద్రసేనారెడ్డి గతంలో మినిస్ట్రీ ఆఫ్ కల్చరల్ శాఖ తరుపున జరిగిన ఈవెంట్స్‌లో చురుకుగా పాల్గొని దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ప్రదర్శనలిచ్చారు. ఈ నేపథ్యంలో ఆయనకు దేశ రాజధాని ఢిల్లీలో జరగనున్న రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనే కళాకారులకు కొరియోగ్రాఫ్ చేసే అవకాశం దక్కింది. ఇంద్రసేనారెడ్డి తండ్రి మల్లారెడ్డికి కూడా నాటకరంగం పట్ల మక్కువ ఎక్కువే. ఈ నేపథ్యంలోనే ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న ఇంద్రసేనారెడ్డి కూడా తండ్రి బాటలో కళారంగం వైపు ఆకర్షితులై నేడు మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

రైతు భరోసా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మండల వ్యవసాయాధికారి బ్రహ్మారెడ్డి



రెంటచింతల: రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలును చేపట్టినట్లు ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం గిట్టుబాటు ధరకే రైతుభరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ఇప్పటికైన క్షేత్ర స్థాయిలో అధికార యంత్రాంగం రైతుల వద్దనుంచి ధాన్యం కొనుగోలుపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వం గ్రేడ్-ఏ రకం ధాన్యానికి 75 కెజీలకు రూ.1,540, సాధారణ రకం(కామన్) ధాన్యానికి 75 కేజీలకు రూ.1,500 మద్దతు ధర ప్రకటించి రైతు భరోసా కేంద్రాల వద్ద కొనుగోలు చేస్తుందన్నారు. నాణ్యత ఆధారంగా గిట్టుబాటు ధరలకే ధాన్యం కొనుగోలు జరుగుతుందని 21 రోజుల్లో నగదుకూడా రైతు ఖాతాలకే నేరుగా జమ చేయడం జరుగుతుందన్నారు.

డిజిటల్ గ్రంథాలయ నిర్మాణానికి చర్యలు

సత్తెనపల్లి: పట్టణంలోని లక్కరాజు గార్లపాడు బస్ స్టాప్ సెంటర్‌లో శిథిలావస్థకు చేరిన గ్రంథాలయ భవనాన్ని కూల్చి వేసేందుకు బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత గ్రంథాలయ స్థలంలో నూతనంగా మహిళల కోసం ప్రత్యేకంగా డిజిటల్ గ్రంథా లయాన్ని, మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరికి ఉపయోగపడేలా కామన్ హాల్ ఏర్పాటు చేసి పాఠకులకు, ప్రజలకు అనుగుణంగా తీర్చిదిద్దేలా చేస్తామన్నారు.

గోదా అమ్మవారికి సారె

సత్తెనపల్లి: పట్టణంలోని గడియార స్తంభం వద్ద గల కోదండ రామాలయంలో గోదా రంగనాయక స్వామి కల్యాణం జరిగి ఐదో రోజు అయిన సందర్భంగా బుధవారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేయించారు. అక్కడి నుంచి ఊరేగింపుగా రామాలయ భక్త బృంద మహిళలు గడియార స్తంభం వద్ద గల రామాలయం వద్దకు వచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదా అమ్మవారికి సారె కార్యక్రమం జరిపించారు. ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు ఆత్మకూరి వెంకట హరే రామ చెంచయ్య, ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు శింగరి మధుసూదన్ రావు, ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



దొడ్లేరు ఆర్బీకే వద్ద ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో వరినారు శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

దొడ్లేరు(క్రోసూరు): గ్రామంలో ప్రకృతి వ్యవసాయం డివిజన్ మాస్టర్ ట్రైనీ సైదయ్య ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు రబీ సీజన్‌లో వరిలో ఏపి పద్ధతులు పాటించాలన్న విషయాల పై అవగాహన కల్పించారు. అనంతరం ఆర్బీకే వద్ద వరి నారును బీజామృతంతో నారు శుద్ధి చేయడాన్ని చేసి చూపించారు. అలా శుద్ధి చేసిన నారు వలన ప్రధాన పంట తెగుళ్లబారిన పడకుండా ఉంటుందని, కొనలు తుంచి నాటటం వలన కాండం తొలిచే పురుగు, రసం పీల్చే పురుగు గుడ్లను పూర్తిగా నశింప చేయవచ్చునన్నారు. పంటను పురుగుల బారిన పడకుండా రక్షించుకోవటమే కాక పిలకలు బాగా వృద్ధి చెందుతాయన్నారు. ఈ విధనాం పాటించటం వలన రైతుకు ఎటువంటి ఖర్చు ఉండదన్నారు. ఆర్బీకే వీఏఏ కమల, ఏఎస్ఎం అనుపమ, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వృషభరాజముల పోటీలను జయప్రదం చేయండి

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- పోటీల పోస్టర్ ఆవిష్కరణ

నరసరావుపేట: పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని డీఎస్ఏ స్టేడియంలో ఈనెల 2 నుంచి 28వ తేదీ వరకు ఎనిమిది రోజుల పాటు నిర్వహించనున్న ఒంగోలు జాతి వృషభరాజముల బండలాగుడు బలప్రదర్శన పోటీలకు వేలాదిగా పాల్గొని దిగ్విజయం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి జిల్లా ప్రజలకు పిలుపు ఇచ్చారు. బుధవారం రాత్రి ప్రకాష్‌నగర్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పోటీలను పురస్కరించుకొని నిర్వాహకులు, కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీలకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎనిమిది విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సీనియర్స్ విభాగం మొదటి బహుమతిగా రూ.లక్ష అందజేయనున్నట్లు వివరించారు. మూడేళ్ల నుంచి పోటీలు నిర్వహిస్తూ గతంలో ఉన్న రికార్డులను బద్దలు చేస్తూ సర్టిఫికెట్లను కూడా పొందటం జరిగిందన్నారు. ప్రతి ఏడాది రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి 150 నుంచి 200 జతల ఎడ్లు పోటీల్లో పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుతో పాటు వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన రెడ్డి, జిల్లాలోని ఇద్దరు మంత్రులు, జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎంపీ, పల్నాడు, గుంటూరు జిల్లాలకు చెందిన శాసనసభ్యులు హాజరవుతారన్నారు. అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి, పుడా చైర్మన్ మిట్టపల్లి రమేష్ పాల్గొన్నారు.

రీ సర్వే ప్రక్రియను పరిశీలించిన తహసీల్దార్

ముప్పాళ్ల: మండలంలోని ముప్పాళ్ళ, నార్నెపాడు, లంకెలకూరపాడు గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్ బుధవారం పరిశీలించారు. గూగుల్‌మ్యాప్ ఆధారంగా ప్రస్తుతం భూములు గుర్తించడం జరుగుతుందన్నారు. సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. భూములకు సంబంధించిన ఆధారాలను, ఆధార్‌కార్డు, ఫోన్‌నంబర్ వివరాలు అందించినట్లయితే సర్వే వేగవంతం అయ్యేందుకు వీలుంటుందన్నారు. అయా గ్రామాల్లోని రైతులు సర్వే బృందం సభ్యులకు సహకరించాలన్నారు. ఆయనతో పాటుగా డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, అయా గ్రామాల వీఆర్వోలు ఉన్నారు.

కాశీ విశ్వేశ్వరునికి ప్రత్యేక పూజలు

అచ్చంపేట: మండలంలోని చామర్రులో పవిత్ర కృష్ణానది ఒడ్డున వేంచేసియున్న విఘ్నేశ్వరుని ఆలయంలోని కాశీవిశ్వేశ్వరునికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి అనిల్‌శాస్త్రి ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, పుష్పాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. గోపూజలు నిర్వహించారు. పలు గ్రామాలనుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

వీధి కుక్కల బెడదతో ప్రజలు బెంబేలు

నాదెండ్ల: గ్రామాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. పంచాయతీ గణపవరంలో నెల రోజుల వ్యవధిలో పది లేగదూడలపై వీధి కుక్కలు దాడి చేసి చంపి తిన్నాయి. మరికొన్ని లేగదూడలు కుక్కల కాటుతో అనారోగ్యం పాలయ్యాయి. అంతేకాక కుక్కలు కరిచి ఇద్దరు రైతులు ఆస్పత్రి పాలయ్యారు. కొద్దిరోజుల నుంచి వీధుల్లో కుక్కలు గుంపులుగా చేరి గ్రామస్తులను వెంటపడుతు భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ద్విచక్ర వాహనాల వెంటపడుతుండటంతో వాహనదారులు బెదిరి కిందపడి గాయాలపాలయ్యారు. పలువురిని కరవటంతో బాధితులు స్థానిక పీహెచ్‌సీలో రేబిస్ వ్యాక్సిన్ డోసులు తీసుకుంటున్నారు. ఇటీవల ఒక గేదె ఈనగా, అప్పుడే పుట్టిన దూడపై కుక్కలు దాడిచేసి చంపాయి. ఇది గమనించిన రైతు వెంటపడటంతో అతనిపై దాడి చేశాయి. ప్రస్తుతం ఆ రైతు కాలు విరిగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గ్రామాల్లో వీధి కుక్కల బెడదను నియంత్రించాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. గణపవరం పంచాయతీ కార్యదర్శి అర్వపల్లి శేఖర్ దృష్టికి గ్రామస్తులు సమస్యను తీసుకెళ్లగా, కుక్కల నియంత్రణకు పంచాయతీలో నిధులు లేవని, అంతేకాక కుక్కలను చంపకుండా, సుదూర ప్రాంతాలకు తరలించాల్సి ఉందన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.